క్లుప్తంగా

స్టాక్ రిజిస్టర్ పరిశీలన



ఆన్‌లైన్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లిలోని దిఆంధ్రబ్యాంక్ కర్షక్ సేవాసమితి ఎరువుల గోదాంను మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వర రావు శనివారం పరిశీలించారు. గోదాంలోని ఎరువుల స్టాక్‌తోపాటుగా రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఆకవరపు మౌనిక పాల్గొన్నారు.

ఘనంగా ఈసీసీఈ డే

బోనకల్: మండలంలోని చొప్పకట్లపాలెం, తూటికుంట్ల, లక్ష్మీపురం, బోనకల్ గ్రామాల్లో ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ.. పూర్వప్రాథమిక విద్య విద్యార్థి జీవితానికి తొలిమెట్టన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, రమాదేవి, శిరీష, రాణి, నాగలక్ష్మి, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



వరిపంటను పరిశీలిస్తున్న ఏఈఓ బాలకృష్ణ

ఏన్కూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని ఏఈఓ బాలకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని ఆరికాలయపాడులో వరిపంటలను శనివారం పరిశీలించి మాట్లాడారు. త్వరలో ఆరికాయలపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు భట్టు హనుమంతు రెడ్డి, వెంకటేశ్వర్లు, జాకోబు పాల్గొన్నారు.

వరల్డ్ హెల్త్ డే

మధిర: వరల్డ్ హెల్త్ డే సందర్భంగా శనివారం మధిర పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం 2 సెంటర్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర కోర్టు న్యాయమూర్తి టి.కార్తీక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యంపట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా వైద్యులు పృధ్వీ నాయక్ పాల్గొని మాట్లాడుతూ.. వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉన్నాయని, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ప్రజలు బయటకు రావాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వ నుంచి ఉత్తమ అవార్డు పొందిన సీనియర్ ఏఎన్‌ఎం విజయకుమారిని ఘనంగా సన్మానించారు. ఆమె అందించిన సేవలను గుర్తుచేస్తూ అభినందించారు.

మజ్జిగ పంపిణీ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో వేసవి దృష్ట్యా వడదెబ్బ బారిన పడకుండా ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగులు, సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు అందచేస్తుంది. శనివారం డిపోలో కార్మికులకు డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ ఎస్.సాహితీ, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ చెట్లు దగ్ధం

కారేపల్లి: నిప్పంటుకుని ఆయిల్‌పామ్ తోటలో చెట్లు దగ్ధమైన ఘటన కారేపల్లిలో శనివారం చోటు చేసుకుంది. కారేపల్లికి చెందిన ముక్కా మహేష్ రెండెకరాల్లో ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుచేస్తుండగా, ఎర్రకుంటు చెరువు సమీపంలో ఉపాధిహామీ పనులకు వచ్చిన కూలీలు చెత్తకు నిప్పంటించారు. దీంతో మంటలు చెలరేగగా సమీపంలోని ఆయిల్‌పామ్ తోటకు నిప్పంటుకుని చెట్లు కాలిపోయాయి. ఘటనపై ఉపాధి హామీ అధికారులకు మహేష్ ఫిర్యాదు చేయగా సోమవారం విచారణ చేపడుతామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా, 33కేవీ విద్యుత్ లైన్ తీగల వెంబడి ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపడుతున్న కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ ఆపరేషన్ శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

ఖమ్మంవ్యవసాయం/చింతకాని: ఖమ్మం నగరంలోని 33/11 కేవీ రామాలయం సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఖమ్మం టౌన్–2 ఏఈడీ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో చింతకాని మండలం నాగులవంచ, పందిళ్లపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

కల్లూరులో జాతీయ రహదారి పక్కన విక్రయిస్తున్న తాటిముంజలు



భలే.. తాటి ముంజలు

- వేసవి తాపానికి ఉపశమనం
- మార్కెట్లో జోరుగా అమ్మకాలు
- ఆరోగ్యానికి ఎంతో మేలు



తాటి ముంజలు అనగానే నోట్లో నీళ్లూరుతాయ్.. వీటిని ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఈ మండే ఎండల్లో చల్లని ముంజలు తింటే ఆ మజానే వేరు.. వేసవి తాపానికి ఉపశమనం.. ఆరోగ్యానికి ఆరోగ్యం.. ఒకప్పుడు పల్లెలో దొరికే తాటిముంజలు ప్రస్తుతం పట్టణాల్లో సైతం లభిస్తున్నాయి.

కల్లూరురూరల్: వేసవి తాపాన్ని తీర్చేందుకు శరీరంలో చల్లదనాన్ని అందించేందుకు తాటిముంజలను ఎక్కువగా తీసుకుంటుంటారు. వీటిని చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు చాలా ఇష్టంగా తింటారు. వేసవి ప్రారంభం కావడంతో వీటికి భలే గిరాకీ ఏర్పడింది. కల్లూరులోని జాతీయ రహదారి వెంట ముంజలను కుప్పలు కుప్పలుగా పోసి ఉండడంతో.. వాహనదారులు, ప్రయాణికులు తమ వాహనాలను ఆపి మరీ కొనుగోలు చేస్తుంటారు. గతేడాది తాటి ముంజలు డజను రూ.15లు నుంచి రూ.25ల వరకు విక్రయించేవారు. ఈ ఏడాది తాటి ముంజలు కొరత వల్ల డిమాండ్ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం డజను ముంజలు రూ.50ల నుంచి రూ.90ల వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు.

తగ్గిపోతున్న దిగుబడి..

తాటి ముంజల దిగుబడి నానాటికి తరిగిపోతుంది. గత పది సంవత్సరాల క్రితం కల్లూరు మండలంలో తాటిచెట్లు అధికంగా ఉండేవి. తాటికల్లు కల్లూరు మండలంలో పుష్కలంగా దొరికేది. ప్రతి ఏడాది కొన్ని వందల తాటి చెట్లు నరికి వేస్తున్నారు. దీంతో తాటి ముంజలకు తీవ్ర కొరత ఏర్పడింది. తాటి ముంజలు ఖరీదైన ఫలంగా మారిపోయింది. కొంత మంది వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి కల్లూరుకు తీసుకొచ్చి తాటి ముంజలు విక్రయిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ అందుబాటులో ఉన్న ఔషధ గుణాలు గల తాటిముంజలు తిని ఈ వేసవిలో వేసిన తాపాన్ని, వడదెబ్బ నుంచి రక్షించుకుందాం.

ఔషధ గుణాలు..

తాటి ముంజల్లో గొప్ప ఔషధ గుణాలు కలిగి ఉన్నాయి. వీటిని తినడం వల్ల శరీరంలో నీరు, లవణాలు, విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. అదే విధంగా శరీరాన్ని చల్లబరిచే గుణం తాటి ముంజలకు ఉంది. వీటిలో ఎలక్ట్రోలైట్స్, ఫైబర్ లాంటి లవణాలు కూడా ఉన్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. గర్భిణులు కడుపుతో ఉన్న సమయంలో ముంజల్ని తినడం వల్ల జీర్ణ వ్యవస్థ చురుగ్గా పనిచేయడంతో పాటు మలబద్దకం, అసిడిటీ లాంటి ఆరోగ్య సమస్యలను దరి చేరనీయకుండా కాపాడుతాయి. వడదెబ్బ బారిన పడకుండా కాపాడతాయి.

ఉపాధి పొందుతున్నాం..



వేసవిలో తాటిముంజలు అమ్మి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఈ సీజన్‌లో బైట కూలీ పనులు తక్కువగా ఉండడం వల్ల ముంజలను విక్రయిస్తున్నాం. చాలా గ్రామాల్లో తాడిచెట్లు నరికి వేయడం వల్ల ముంజలు సరిగి దొరకడం లేదు. దీంతో ముంజలకు గిరాకీ బాగా పెరిగింది.

– పోతురాజు వీరరాఘవులు, వ్యాపారి, తాళ్లపెంట

ఆరోగ్యానికి ఎంతో మంచిది..



వేసవికాలంలో తాటి ముంజలు తింటే చలువ కాబట్టి తప్పకుండా తింటాము. ప్రకృతి సహజంగా దొరికే ఈ ఫలంలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని చాలా మందికి తెలియదు. గ్రామాల్లో తాడిచెట్ల పెంపకాన్ని ఎవరూ చేపట్టడం లేదు. ఇకనైనా గ్రామాల్లో తాడిచెట్లు విరివిగా పెంచినట్లైతే పర్యావరణంతో పాటు తాటిముంజలు లభ్యమవుతాయి.

– కర్నాటి అప్పిరెడ్డి, కల్లూరు

ముస్లింలకు ఇఫ్తార్ విందు

చింతకాని/కల్లూరురూరల్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని చింతకాని గ్రామంలో ముస్లిం సోదరులకు చింతకాని సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు కిలారు జగన్మోహన్‌రావు, సరోజిని దంపతులు శనివారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. అదే విధంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కల్లూరులోని జామియా మసీదులో జెడ్పీటీసీ సభ్యుడు అజయ్‌ఖమార్ ముస్లింలకు విందు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులు, ముస్లింలందరూ సోదర భావంతో ఉండాలని, ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని తెలిపారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం మత పెద్దలు జగన్మోహన్‌రావు కుటుంబసభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కిలారు మనోహర్‌బాబు, వేణుగోపాల్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యుడు కమ్లి, డీసీసీబీ డైరెక్టర్ లక్ష్మణరావు, నాయకులు వెంకటేశ్వరరావు, కృష్ణ, శ్రీనివాసరావు, జమలయ్య, రమేష్, ముస్లిం కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అలీ, మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండీ హనీఫ్, సయ్యద్ ఇషాక్, సయ్యద్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.



కల్లూరురూరల్: ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దాతలు

ఎర్రుపాలెం: పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు ఓటమిని అంగీకరించకుండా సన్నద్ధం కావాలని జీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు జంగా గురునాథ రెడ్డి అన్నారు. డీఎస్సీ స్టడీ మెటీరియల్‌ను వీఎస్‌కే కన్‌స్ట్రక్షన్ అధినేత వేజండ్ల సాయికుమార్‌తో పాటు పలువురు దాతలు రూ. 1.50 లక్షలతో కొనుగోలు చేసి వితరణ చేయగా.. వీటిని మండలకేంద్రంలోని ఎస్‌జేకేఎం జూనియర్ కళాశాలలో 150 మంది అభ్యర్థులకు గురునాథరెడ్డి, దాతలు శనివారం అందించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రంగారావు మాట్లాడారు. దాత సాయికుమార్, దాతలను పలువురు అభినందించి శాలువాలతో సత్కరించారు. కళాశాల డైరెక్టర్ దండెం సత్యనారాయణరెడ్డి, దాతలు రుద్రపోగు శ్రీను, గుర్రాల శ్రీనివాసరెడ్డి, వేమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, జగదీశ్‌పాల్, పీఆర్‌టీయూ మండల కమిటీ అధ్యక్షులు సంగిరెడ్డి, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

మధిర: ముస్లిం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రంజాన్ ఈద్ కా తోఫాల పంపిణీ మధిర జామియా మసీద్ షాదీఖానాలో నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మౌలానా షేక్ ముజాహిద్ మాట్లాడుతూ.. రంజాన్ సందర్భంగా నియోజకవర్గంలో 1,600 మందికి రంజాన్ తోఫాలను అందించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మౌలానా షేక్ ముజాహిద్, సహాధ్యక్షుడు షేక్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, కోశాధికారి షేక్ మొహమ్మద్ గౌసుద్దీన్, మండల కమిటీ అధ్యక్షుడు షేక్ గాలిబ్, సహాధ్యక్షుడు మహమ్మద్ జమీర్, షేక్ సైదులు, సెక్రెటరీ షేక్ జాకీర్ హుస్సేన్, కోశాధికారి షేక్ మీరా సాహెబ్, షేక్ మహబూబ్ సుభాని, సయ్యద్ కరీం, షేక్ హైదర్, షేక్ మొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

మధిర/కారేపల్లి/ఏన్కూర్: భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం మధిర, కారేపల్లి,ఏన్కూర్ మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలను తమ ఇళ్లపై కట్టడంతో పాటు ప్రధాన సెంటర్లలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర పార్టీ సూచన మేరకు ఎవరి ఇంటి నుంచి వారే టిఫిన్ బాక్సులు తెచ్చుకొని అల్పాహారం తీసుకుంటూ, పార్టీ సంస్థాగత విషయాలతో పాటు త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను చర్చించి, బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని నిశ్చయించుకున్నారు. ఈ నేపథ్యాన మధిర పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన సందర్భంగా పార్టీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు , కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో జెండాను ఆవిష్కరించిన సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు తురక నారాయణ, కల్లి రాంప్రసాద్‌లు, ఏన్కూర్‌లో పోలింగ్ బూత్ నంబర్ 112లో జెండాలను నాయకులు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరు రమేష్, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు పాపట్ల రమేష్, యువమోర్చా జిల్లా కార్యదర్శి కాశిని నాగభూషణం, మన్ కీ బాత్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల స్వర్ణాకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పగడాల నాగేంద్రబాబు, బొల్లి వెంకటేశ్వర్లు, వజినేపల్లి దర్గయ్య, కోటేశ్వరరావు, ఈసం భాస్కర్, చీమల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



కారేపల్లిలో జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

తుక్కుగూడకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

హైదరాబాద్‌లోని తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నిర్వహించే జన జాతర బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. శనివారం అన్ని గ్రామాల నుంచి ప్రధాన సెంటర్‌కు చేరుకొని జై కాంగ్రెస్, జై సోనియా, జై రాహుల్ గాంధీ అంటూ నినదిస్తూ ర్యాలీ తీశారు. అనంతరం పార్టీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వాహనాలను పార్టీ నాయకులు జెండా ఊపి ప్రారంభించగా నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లి: సభకు బయలుదేరుతున్న కాంగ్రెస్ శ్రేణులు

ఆలిండియా 58వ ర్యాంక్



చరణ్ శ్రీవాత్సవ్

మధిర: జాతీయ స్థాయిలో జరిగిన ఎన్డీఏ (నేషనల్ డిఫెన్స్ అకాడమీ) ఫైనల్ ర్యాంకింగ్‌లో మధిర పట్టణానికి చెందిన కొండూరు చరణ్ శ్రీవత్సవ్ ఆలిండియా 58వ ర్యాంకు సాధించాడు. శ్రీవాత్సవ్ తల్లిదండ్రులు కొండూరు యలమందరావు, సుజాత ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఎన్డీఏలో ప్రవేశాలకు నిర్వహించే యూపీఎస్సీ అర్హత పరీక్ష, ఇంటర్వ్యూలో సత్తా చాటిన ఆయనను పలువురు అభినందించారు.

పారదర్శకంగా దళితబంధు మంజూరు

కారేపల్లి: తొలివిడుత దళితబంధు పథకం మంజూరు పారదర్శకంగా జరిగిందని లబ్ధిదారులు పప్పుల నిర్మల, చెవుల చందు, తిప్పారపు వీర బాబు, ఎర్రబెల్లి రామారావు, చిలుముల విజయ్‌లు పేర్కొన్నారు. శనివారం కారేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కారేపల్లి మండలంలో 21మందికి దళితబంధు మంజూరైందన్నారు. కానీ కొంతమంది పనిగట్టుకొని దళితబంధు మంజూరులో గత ఎమ్మెల్యేకు, ఎమ్మెల్సీకు కమిషన్లు ఇచ్చామని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని.. ఇది సబబు కాదని తెలిపారు.

సన్మానం

తల్లాడ: ఇటీవల గురుకుల ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ కొలువు సాధించిన అన్నారుగూడెం గ్రామానికి చెందిన తోట కృష్ణారావు, నీలం రాజేశ్వరి, సూదా బ్రహ్మంద్రను శనివారం సన్మానించారు. స్థానిక మహాలక్ష్మి కల్యాణ మండపంలో ఎంపీపీ శ్రీనివాసరావు చేతుల మీదుగా సన్మానం జరిగింది. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాసరావు, దేవేంద్ర, వెంకటయ్య, కృష్ణయ్య, రోశయ్య, రాజారావు, నర్సమ్మ, వెంకటేశ్వరరావు, రామారావు, వెంకటనరసింహారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠా విగ్రహాల ఊరేగింపు

సత్తుపల్లిటౌన్: ఈ నెల 13వ తేదీన సత్తుపల్లిలోని జవహర్‌నగర్ శ్రీకృష్ణ మందిరంలో పునఃప్రతిష్ఠ సందర్భంగా తమిళనాడులోని మహాబలిపురం నుంచి తీసుకొచ్చిన రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి విగ్రహాలను శనివారం పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు దారిపొడవున పూలు చల్లుతూ.. నీళ్లు వారపోస్తూ.. పూజలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

సామూహిక సత్యాగ్రహాన్ని జయప్రదం చేయండి

కొణిజర్ల: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును నిరశిస్తూ ఆదివారం కొత్త కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే సామూహిక సత్యాగ్రహం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆప్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు స్వర్ణ సుబ్బారావు, గంధం పుల్లయ్య తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ సత్యాగ్రహ శిబిరాన్ని ఆప్ కోర్ కమిటీ సభ్యుడు నల్లమోతు తిరుమల రావు ప్రారంభిస్తారని తెలిపారు. కేజ్రీవాల్ విధానాలు నచ్చే ప్రతి ఒక్కరూ ఈ సత్యాగ్రహంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు



ఏన్కూరు: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రమేష్



సత్తుపల్లిటౌన్: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఏన్కూరు/ముదిగొండ/సత్తుపల్లిటౌన్: వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని ఎంపీడీఓలు సకినాల రమేష్, శ్రీధర్‌స్వామి తెలిపారు. ఏన్కూరు, ముదిగొండలోని పంచాయతీల ఆధ్వర్యంలో.. పంచాయతీ కార్యాలయం ఎదుట, ముదిగొండలోని బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను వారు ప్రారంభించారు. అదే విధంగా సత్తుపల్లి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన బిందు ఆటోమొబైల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్ చలివేంద్రాన్ని శనివారం వ్యాపారవేత్త మొరిశెట్టి సాంబశివగుప్తా ప్రారంభించారు. ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలల్లో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నరసింహారావు, ఎంపీఓలు నారాయణ, సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సంపత్, జీవీమాల్ మేనేజర్ భాస్కర్, సయ్యద్‌గౌస్, గడ్డం శ్రీనివాస్, ఎస్‌కె సుభాని, పాషా, ఎస్‌కె బాబు, రంజిత్, జి.కృష్ణారెడ్డి, మిద్దే శ్రీను పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

మధిరరూరల్: మాటూరు హైస్కూల్ పాఠశాలలో విద్యార్థులకు వడదెబ్బపై హెల్త్ సూపర్‌వైజర్ ఊటుకూరు భాస్కర్‌రావు అవగాహన కల్పించారు. శనివారం పాఠశాలలో మాటూరుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాస్కర్‌రావు మాట్లాడారు. వేసవి దృష్ట్యా విద్యార్థులు బయట తిరగొద్దని.. ఇంట్లోనే ఉండాలన్నారు. ప్రతి రెండుగంటలకోసారి నీటిని తాగాలన్నారు. ఇంట్లో తయారు చేసుకున్న నిమ్మకాయ నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్, కొబ్బరి బొండం, పుచ్చకాయ, తాటి ముంజలు, చెరుకురసం, పండ్ల రసాలు విరివిగా తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఎండ వేడిమి 40 డిగ్రీలు దాటి ఉంటుందని, మన శరీర ఉష్ణోగ్రత 37పైన ఉంటే జ్వరంగా భావిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చెరుపల్లి శ్రీహరి, సాయి కృష్ణ, రమాదేవి, ఆశ కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఊటుకూరు భాస్కర్‌రావు

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



కాకర్లపల్లి పంచాయతీ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సత్తుపల్లిరూరల్: పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా నాయకుడు అమర్లపూడి శరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సత్తుపల్లి మండలం కాకర్లపల్లి, రుద్రాక్షపల్లి తదితర గ్రామ పంచాయతీల్లోని కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో వేలాది మంది మల్టీపర్పస్ కార్మికులుగా వివిధ విధులు నిర్వహిస్తూ గ్రామానికి సేవ చేస్తున్నారని.. అలాంటి కార్మికులకు గత కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వటం లేదన్నారు. జీతాలు రాకపోవటంతో పంచాయతీ కార్మికుల కుటుంబాలు గడవని పరిస్థితి ఉందన్నారు. ప్రతి నెల ఉద్యోగులతో పాటుగా కార్మికులకు జీతాలు వచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బొజ్జ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్మికులు వెంకటేశ్వరరావు, రవి, లక్ష్మి, గంగరాజు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇవ్వాలి

తల్లాడ: మండలంలో నకిలీ వరి విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు అన్నారు. శనివారం తల్లాడ మండలం తెలగవరం, రేజర్ల గ్రామాల్లో నష్టపోయిన వరి పైర్లను పరిశీలించారు. నకిలీ విత్తనాలతో సాగుచేయడం వల్ల కొందరు రైతులు నష్టపోయారని తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, ఎల్లంకి సుధాకర్, రాలయ రమేష్, గొల్లమందల నరేష్, నాగులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిన్న సత్యం సేవలు అజరామరం

కొణిజర్ల: సీపీఐ అభివృద్ధికి పాత ఖమ్మం తాలూకాలో ఎనలేని కృషి చేసిన తుళ్లూరి చిన సత్యం సేవలు మరువ లేనివని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. శనివారం తనికెళ్లలో చిన సత్యం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంతరావు చిన సత్యం స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబు, పీవీరావు, సీతారామయ్య, వీరభద్రం, వెంకటయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు కృషి చేయాలి



అన్నదానం చేస్తున్న రాజశేఖర్, సందీప్

మధిర: ప్రతి ఒక్కరూ సమాజసేవకు కృషి చేయాలని మధిర లయన్స్ క్లబ్ కార్యదర్శి వంగవీటి రాజశేఖర్, వ్యాపారి సిద్ధంశెట్టి సందీప్ తెలిపారు. మధిర మున్సిపల్ కౌన్సిలర్ కోనా ధనికుమార్, సుచరిత దంపతుల కుమారుడు రోహిత్ గుప్తా జన్మదిన వేడుకలను శనివారం స్థానిక ఆర్కే ఫౌండేషన్ అనాధాశ్రమంలో నిర్వహించారు. వృద్ధులకు, అనాధలకు స్వీట్లు, పండ్లు పంపిణీతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేములపల్లి శ్రీనివాసరావు, చక్రి, వెచ్చా వీరభద్రరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు సాగునీరు అందించాలి

ఏన్కూరు: పాలేరు నుంచి సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శనివారం తెలంగాణ రైతు సంఘం బృందం సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారామ కాలువలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాలకొల్లు వరకు తవ్వి నిలుపుదల చేశారన్నారు. అదే విధంగా పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేసే కాల్వలు తిరుమలాయపాలెంలో పూర్తి చేసి.. మధ్యలో ప్రధాన కాల్వలను గత మూడు సంవత్సరాలుగా తవ్వడం లేదన్నారు. దీంతో రైతులు సాగునీరు అందక తీవ్రంగా నష్టపోతున్నరన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గికృష్ణ, వజ్జా రామారావు, మండల కార్యదర్శి గుండా సత్యనారాయణ రెడ్డి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీ, నాగేశ్వరరావు, రాములు తదితరులు పాల్గొన్నారు.



సీతారామ ప్రాజెక్ట్ కాల్వను పరిశీలిస్తున్న రాంబాబు

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



పి.లావణ్య



వి.శ్రావణి

కల్లూరు: కాకతీయ యూనివర్శిటీ ప్రకటించిన డిగ్రీ 1,3,5 సెమిస్టర్లలో కల్లూరు డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో ర్యాంకులు సాధించి తమ ప్రతిభ చూపారు. ఫైనల్ ఇయర్ బీఎస్సీ (బీజడ్‌సీ) 5వ సెమిష్టర్‌లో పి.లావణ్య 9.34/10, వి.శ్రీవాణి 9.17/10, ఎస్‌కే ఫర్హానా 9.15/10 ఎస్‌జీపీఏ సాధించారు. బీఎస్సీ(ఎంపీసీఎస్)లో కె.కల్పన 8.19/10, ఎం.ప్రసన్న జ్యోతి 8.10/10, కె.నాగమల్లేశ్వరి 8.05/10 ఎస్‌జీపీఏ సాధించారు. బీకామ్ ఫైనల్ ఇయర్‌లో పి.ప్రజ్ఞతేజ 8.58/10, ఎం.ప్రియాంక 8.24/10 ఎస్‌జీపీఏ సాధించారు. సెకండ్ ఇయర్ బీజడ్‌సీ 3వ సెమిష్టర్‌లో ఎం.గౌతమి 8.11/10, ఎంపీసీఎస్‌లో ఆర్.ఉమారాణి 8.42/10, బీఏ సెకండ్ ఇయర్‌లో ఎండీ.అఫ్రా 8.44/10, బీకామ్ ప్రథమ సంవత్సరం మొదటి సెమిష్టర్‌లో వి.ఉమాధనలక్ష్మి 8.23/10, బీఎస్సీ ఎంపీసీఎస్‌లో జె.అఖిల 8.56/10 ఎస్‌జీపీఏ సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ లక్కినేని ప్రసాద్, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ రామాల ప్రసాద్, జి.నాగేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

లిటిల్ చాంప్స్ ఒలంపియాడ్‌లో..

సత్తుపల్లి: హైద్రాబాద్ లిటిల్ చాంప్స్ ఎడ్యుకేషనల్ అకాడమి నిర్వహించి రాష్ట్రస్థాయి తెలుగు, మ్యాథ్స్ ప్రతిభా పరీక్షల్లో సత్తుపల్లి వీవీ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారు. మ్యాథ్స్ విభాగంలో ముగ్గురు, తెలుగు విభాగంలో ఐదుగురు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి గోల్డ్‌మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. ప్రతిభచూపిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఒగ్గు భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు ప్రమీలారాణి అభినందించారు.

జిజ్ఞాస పోటీల్లో..

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారు ప్రతిష్టాత్మకంగా ప్రతిఏటా నిర్వహించే జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ పోటీలకు 2023–24 సంవత్సరానికి సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏడు సబ్జెక్టుల ప్రాజెక్టులకు ఎంపికైంది. రాష్ట్ర వ్యాప్తంగా 16 సబ్జెక్టులలో 1,033 స్టడీ ప్రాజెక్టులు పోటీల్లో పాల్గొనగా రాష్ట్ర స్థాయిలో 290 ప్రాజెక్టులు ఎంపిక చేశారు. వీటిలో ఈ కళాశాల నుంచే రాష్ట్రంలోనే అత్యధికంగా ఏడు సబ్జెక్టులకు స్టడీ ప్రాజెక్టులు ఎంపిక కావటం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.